


## 3

## గత సంచికనుంచి కొనసాగింపు

**జరిగిన జగన్నాటకం**

**"బోస్" సవ్యలంకలో కళ్ళు తెరిచాడు. ఎడమచేతితో మంచినీళ్ళు ఇవ్వబోయిన పిల్లాడికి తప్పు అని చెప్పి భంగపడ్డాడు. గుళ్ళో ప్రసాదం తిన్న తరువాత అతణ్ణి బంధించారు.**

నోటికి కట్టిన గుడ్డ తడి మొత్తాన్ని పీల్చేయడంతో నాలుక పీక్కుపోతోంది. చేతులకి వేసిన సంకెళ్ళ వల్ల త్వరగా నడవడం సాధ్యపడట్లేదు. అతడిని బంధించిన ఆకుపచ్చ దుస్తుల మనుషులు గుర్రాలను కాస్త నెమ్మదిగా నడుపుతున్నారు. అయినా ఆ నడక కష్టంగా వుంది బోసుకి. జనం ఆశ్చర్యంగానూ, జాలిగానూ బోసు వంక చూస్తూ రోడ్డుకి ఇరువైపులా నిలబడ్డారే తప్ప ఏ ఒక్కరూ కాపాడటానికి ముందుకు రాలేదు. వస్తారని కూడా బోసుకు అనిపించట్లేదు. నాలుగు దారులు కలిసే కూడలి చేరిన తరువాత వాళ్ళ ప్రయాణం ఆగింది.

దళాధిపతి గుర్రం దిగి పక్కన వున్న ఓ సైనికుడికి సైగ చేశాడు. ఆ సైనికుడు ఒక డప్పు అందుకోని వాయించడం మొదలుపెట్టాడు. జరగబోయేదేమిటో అర్థం కాక చేతులు కాళ్ళు గింజుకుంటున్నాడు బోస్. డప్పు శబ్దం విన్న జనం క్రమంగా అక్కడ గుంపుగా ఏర్పడ్డారు. ఆ తరువాత కొంతసేపటికి డప్పు శబ్దం ఆగిపోయింది.

"ప్రజలారా!" గంభీరమైన కంఠంతో గట్టిగా అరిచాడు దళాధిపతి. "వీడు సవ్యలంక ధర్మగంధాన్ని అతిక్రమించాడు. పవిత్రమైన దేవాలయంలో కుడిచేతిని చాపి ప్రసాదం తిన్నాడు" చెప్పాడతను. జనంలో ఒక్కసారిగా కోలాహలం. బోసు చేసిన తప్పుకి ఎలాంటి శిక్షపడబోతోందో ముందే తెలిసినట్లు మాట్లాడుకోసాగారు. బోసుకు మనసులో అలజడి ఇంకా తీవ్రరూపం దాల్చింది. ప్రసాదం కుడి చేత్తో తింటే తప్పా? అని ఆశ్చర్యపోయాడు. అడిగే అవకాశం లేదని విలవిలలాడాడు.

"ధర్మగ్రంధంలోని నలభై మూడొవ ధర్మాన్ని అతిక్రమించడం ఎంత తీవ్రమైన నేరమో మీ అందరికీ తెలుసు. అదీ కాక అక్కడి ఆచార్యుల మీద దాడి చేసే ప్రయత్నం కూడా చేశాడు. ఇది అరవై ఒకటో ధర్మాతిక్రమణ. ఈ నేరాలకు వీడిని మహాధినేత దగ్గరకు తీసుకెళ్ళాల్సిన పనిలేదు. నేర తీవ్రతని అనుసరించి శిక్షి విధించే అధికారం దళాధిపతికే ఇవ్వబడింది. ఆ అధికారమే ఆధారంగా ఈ నీచుడికి ఇక్కడే మీ అందరి సమక్షంలో మరణదండన విధించాలని నిర్ణయిస్తున్నాను." అన్నాడు. చుట్టూ వున్న జనం హర్షాతిరేకాలతో ఆ తీర్పుకి తమ మద్దత్తుని ప్రకటించారు.

అదిరిపడ్డాడు బోసు. "మరణదండనా?" ఆశ్చర్యం స్థానంలో ఇప్పుడు భయం మొదలైంది. కానీ ఆ భయం కూడా రెండు క్షాణాలు మించి నిలవలేదు. అతని పక్కన వున్న సైనికుడు కత్తిని సిద్ధంగా పట్టుకోగానే భయం స్థానంలో నైరాశ్యం వచ్చి చేరింది. మరో రెండు క్షణాలలో కత్తి మెడపైన పడుతుందనంగా బోసు కళ్ళు మూసుకున్నాడు. అతనికి మళ్ళీ గాంధీ కనిపించాడు. ఎవరో అతని గుండెల్లోకి తుపాకితో కాల్చారు. ఆయన "హే రామ్" అంటూ ఒరిగిపోయాడు. బోసు కూడా "హే రామ్" అంటూ గొణిగాడు.

సరిగ్గా అదే సమయంలో ఆ జనసమూహానికి కాస్త దూరంగా ఒక మర్రి చెట్టుపైన వున్న వ్యక్తి తీక్షణమైన తన బాణాన్ని ఎక్కుపెట్టి, నారి సారించి విడిచిపెట్టడానికి సిద్ధంగా వున్నాడు.

★★★

3

ఆచార్య వేదాంతం తన పాఠం మొదలుపెట్టబోతూ ఒక్కసారి చుట్టూ పరికించి చూశాడు. ఆయన ఎత్తు నాలుగడుగులకు మించి వుండదు. వెనుక వరుసదాక నిండిపోయి వున్న అందరినీ చూడటానికి కొంచెం కష్టపడాల్సి వచ్చింది. అందరికన్నా వెనుక వరుసలో వున్న వాళ్ళనే ప్రత్యేకంగా చూశాడు. అందరూ ఉన్నారు, ఒక్కళ్ళు తప్ప. ఆ ఒక్కరి కోసమే ఆయన కళ్ళు వెతుకుతున్నాయి.

మిగిలిన విద్యార్థులంతా ఆయన నోటి నుంచి వచ్చే ప్రతిమాటను అమాంతంగా ఒడిసిపట్టుకోవాలన్నంత ఆసక్తిగా చూస్తున్నారు. కానీ ఆయన నోటి నుంచి ఏ మాటా రావటంలేదు. చివరి వరసలో ఖాళీగా వున్న కుర్చీని మరోసారి చూసి గుమ్మం వైపు చూశాడు. అక్కడ కూర్చునే విద్యార్థిని పేరు ద్వీప. ఆ అమ్మాయి వస్తే కానీ పాఠం మొదలవదని మిగిలిన విద్యార్థులు గ్రహించి అందరూ గుమ్మం వైపే చూశారు. నిముషం తరువాత ద్వీప ఆ గుమ్మం దాటి లోపలికి వచ్చింది. చిరునవ్వుతో ఆచార్య వేదాంతాన్ని పలకరించి, కళ్ళతోనే క్షమాపణలు చెప్పి, వడివడిగా చివరి వరుసలోకి వెళ్ళి తన స్థానంలో కూర్చుంది. ఆయన నవ్వి, వెనక్కి తిరిగి గోడ మీద "చరిత్ర" అని రాశాడు.

"చరిత్ర అంటే గతాన్ని తెలుసుకోవడం. నిన్న జరిగింది నేటికి చరిత్ర. దానికన్నా ముందురోజు జరిగింది, అంతకు ముందు నెల జరిగింది, దానికి ముందు సంవత్సరంలోజరిగింది, అంతకన్నా ముందు దశాబ్దంలో, శతాబ్దంలో ఏం జరిగిందో ఇదంతా చరిత్రే. కానీ ఇలా తొవ్వుకుంటూ ఎంత దూరం వెళ్ళాలి? చరిత్రకు ఆది అంతం అనేది లేదా? గడిచిపోయిన ప్రతి క్షణం చరిత్రే కాబట్టి గడిచిన క్షణం చరిత్రకు ముగింపు అనుకుందాం. మరి చరిత్ర మొదలయ్యేది ఎక్కడ?" అని చుట్టూ చూశాడు. ఆయన చెప్పేది చరిత్రైనా, తత్వమైనా, తర్కమైనా ఎవరూ చూడని కొత్త కోణాన్ని చూపిస్తాడు. అదే ఆయనలో విద్యార్థులకు నచ్చేది. అందుకే ఆయన పాఠం అంటే ప్రతి ఒక్కరూ హాజరౌతారు.

"చెప్పండి. చరిత్ర ప్రారంభం ఎక్కడ వుంది?" మళ్ళీ అడిగాడాయన.

"రాతి యుగం మొదలైనప్పటి నుంచి చరిత్ర మొదలైనట్లు" రెండో వరుసలో ఎవరో అన్నారు.

"నిప్పు కనిపెట్టినప్పటి నుంచి"

"కాదు జీవం మొదలైనప్పటి నుంచి" మరొకరెవరో ముందు వరుస నుంచి

ముందు వరుసలో వున్నవాళ్ళ సమాధానాల మీద ఆయనకు ఎలాంటి ఆసక్తి లేదు. వాళ్ళంతా తెలివితక్కువ వాళ్ళు. ఆచార్యుడి నిరంతర పర్యవేక్షణ, అవసరమైతే వెంటనే సహాయం కోరేందుకు అవకాశం వుండాలని మామూలు విద్యార్థులంతా ఆయనకు దగ్గరగా ముందువరుసల్లో వుంటారు. తెలివైనవాళ్ళంతా వెనుక వరుసల్లోనే వుంటారు. అందుకే ఆయన కాళ్ళు పైకి మరీ ఎత్తి చూశాడు. అక్కడంతా నిశబ్దంగానే వుంది. ద్వీప ఏదో ఆలోచిస్తోంది. ఆమెను చూస్తే ఆచార్య వేదాంతానికి తనని తాను చూసుకున్నట్లుగా వుంటుంది. "తన ఆలోచనాస్రవంతికి కొనసాగింపు. తన మేధాసంపత్తికి వారసురాలు." అనుకున్నాడు

"గ్రహాల ఆవిర్భావం నుంచే చరిత్ర ఆరంభం కాదా?" రెండో వరుస నుంచి ప్రశ్న రూపంలో సమాధానం దూసుకొచ్చింది. సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో ఆయన తన ప్రసంగం మొదలుపెట్టాడు.

"గ్రహాల ఆవిర్భావం జరగడం చరిత్ర కాదు ఖగోళశాస్త్రం. అలా జరిగిన తరువాత ఈ భూమి పైన కొన్ని మూలమైన వస్తువులు మాత్రమే వున్నాయి. వాటినే రసాయన శాస్త్రంలో మూలకాలు అంటారు. మొదట కర్బనం ఒక్కటే వుంటి వుండచ్చు. క్రమంగా కొన్ని కొత్త మూలకాలు పుట్టుకొచ్చాయి. కొన్ని రూపాంతరం చెంది కొత్త మూలకాలుగా మారాయి. వాటిలో కొన్ని ఒకదానితో ఒకటి కలిసి మిశ్రమాలుగా రూపొందాయి. అవి ద్రవ, వాయు, ఘన రూపాలలో అవతరించాయి. ఇదంతా ఏ శాస్త్రం?"

"రసాయన శాస్త్రం" అందరూ గట్టిగా అన్నారు.

"సెభాష్... ఇప్పుడు అలా ఏర్పడ్డ మిశ్రమాలలో ఒక మిశ్రమానికి చెందిన ఒకే ఒక్క కణంలో జీవం వచ్చి చేరింది. అది ఏక కణ జీవిగా ఆవిర్భవించింది. అక్కడి నుంచి మార్పులు మొదలయ్యాయి. ఒక్క కణం నుంచి, అనేక కణాలు వున్న జీవరాసులుగా పరిణామం. మొక్కలుగా, జలచరాలుగా, పక్షులుగా, జంతువులుగా ఆ జంతువులలో కోతి లాంటి జంతువు నుంచి ఆదిమానవుడిగా... ఇదంతా చరిత్ర కాదు. ఇది జీవశాస్త్రం." విద్యార్థులంతా సంభ్రమంగా వింటున్నారు. కొన్ని కోట్ల సంవత్సరాల జీవపరిణామం కొన్ని క్షణాలలో వాళ్ళ కళ్ళ ముందు ఆవిష్కృతమైంది. ఆచార్య వేదాంతం ఇంకేదో చెప్పబోయి ఆగిపోయాడు. వెనుక వరుసలో పైకి లేచిన చేతిని చూసి! అది ద్వీప చెయ్యి.

చెప్పమన్నట్లు సైగ చేశాడు.

"జీవ పరిణామ క్రమంలో రకరకాల జంతువులు పుట్టుకొచ్చాయి కదా. ఉదాహరణకు కోతులనే తీసుకోండి. పది అడుగులు వుంటే భయంకరమైన కోతుల నుంచి రెండు అడుగుల కోతుల వరకు, నల్లటి కోతుల నుంచి తెల్లటి కోతుల వరకు రక రకాల రంగుల్లో, లక్షణాలలో, అంతర్గత జీవనిర్మాణంలో ఎన్నో వ్యత్యాసాలతో ఒకే రకమైన జంతువులు పుట్టాయి కదా? మరి మనుషుల్లో అన్ని రకాలుగా మనుషులు ఎందుకు లేరు?" ఆమె ప్రశ్న

"ఎందుకు లేరు? జంతువుల్లో శారీరకంగా, అంతర్గతంగానూ వ్యత్యాసాలు వున్న జంతువులు ఆవిర్భవించినట్లే మనుషుల్లో కూడా రకరకాల వ్యక్తులు పుట్టుకొచ్చారు. నిజానికి వాళ్ళని మనం మనుషులు అని కూడా అనలేము. శరీరాకృతిలో, రంగు, ఎత్తు వంటి లక్షణాలలో వ్యతాసం గురించి కాదు నేను చెప్పేది. వారి కణం, మన కణంలో వుండే వ్యత్యాసం గురించి. మనం ఒక రకమైన కోతుల నుంచి పుడితే, వాళ్ళు మరో రకం కోతులనుంచి పుట్టారు. చరిత్రకారులు మన జాతిని ఆదిమానవుడు అంటే వాళ్ళని నిటారులు, నియాండరులు[1] అంటారు." అంటూ వివరించాడాయన.

"మరి ఆ జాతులన్నీ ఏమైపోయాయి? ఎలా అంతరించి పోయాయి?"

"మన పూర్వీకులు చీకటి ఖండంలోని తూర్పుదేశం[2] నుంచి విస్తరించడం మొదలుపెట్టిన తరువాత మిగిలిన మానవ సంబంధమైన జాతులు అంతమైపోయాయి." ద్వీప సమాధానానికి చేరువగా వచ్చిందని ఆయన ముఖంలో ఆనందం చిరునవ్వై చిందుతోంది.

"అయితే మన పూర్వీకులైన ఆది మానవుడు మిగిలిన మానవజాతులను అంతమొందించడం నుంచే చరిత్ర మొదలౌతుందనుకుంటాను. మానవ చరిత్ర మొదటి ఆంకం రక్తపాతంతో మొదలౌతుంది" సమాధానం తెలుసుకున్న ఆనందం కన్నా ఆ సమాధానంలో వున్న విషాదం ఆమెలో ఎక్కువగా కనపడింది.

---

1. ఆదిమానవుడు: homo sapiens; నిటారులు = Homo erectus; నియాండరులు = Neanderthal (హోమో సెపియన్స్ తో పాటు ఆవిర్భవించిన ఇతర మనుష్య జాతులు); 2. చీకటి ఖండంలోని తూర్పు దేశం = తూర్పు ఆఫ్రికా

"చాలా దగ్గరకు వచ్చావు. మన పూర్వీకులైన ఆదిమానవుడు మిగిలిన మానవజాతులను అంతమొందించడానికి ముందు మరో అంకం వుంది. అది వివేకశక్తికి సంబంధించిన ఒక విప్లవం. మానవ రూపం వచ్చినా ఆ జాతులన్నీ ఇంకా జంతువులలాగే బ్రతుకుతున్న కాలంలో మన పూర్వీకులలో ఒక చిన్న మార్పు వచ్చింది. దాన్నే వివేకమని గుర్తిస్తారు చరిత్రకారులు. జీవశాస్త్రం ప్రకారం అయితే ఇది మెదడులో జరిగిన ఒక చిన్న పరిణామం. ఏది ఏమైనా మనిషిలో వివేకశక్తి పెరిగింది. విషయాన్ని అర్థం చేసుకునే గ్రహింపు, సంభాషించుకునే తెలివితేటలు ఇవన్నీ అప్పుడే మొదలయ్యాయి. వీటన్నింటిని మించినది మరొకటి వుంది. మనిషి మనిషిగా అవతరించడానికీ, మనిషి మరో మనిషిలాంటి జీవాన్ని అంతమొందించడానికీ, ప్రగతికీ, పతనానికీ కారణమైనది. అదే.... ఊహ!!"

"ఊహ?" విద్యార్థులంతా ఆశ్చర్యపోయారు.

"అవును. మానవుడు ఊహించడం నేర్చుకోవడమే చరిత్రకు మూల బీజం. ఊహ అంటే ఏమిటి? కల్పన. లేనిది ఉన్నట్టుగా కల్పించుకోవడం. అది నిజం కాదు. అది ఆత్మాశ్రయమైనది. "భూమి గుండ్రంగా వున్నది" అన్నది నిజం. దీనిని కనుకున్నా కనుక్కోకపోయినా అది అలాగే వుంటుంది. చిన్న పిల్లలు చెట్టు మీద భూతం వుంది అని నమ్మితే అది ఊహ. ఆ చిన్న పిల్లాడి మనసులో మాత్రమే అది వుంటుంది. అందుకే అది ఆత్మాశ్రయమైనది. ఇక్కడి వరకూ బాగానే వుంది. అదే చిన్న పిల్లాడి ఊహని అతని మిత్రులంతా అంగీకరించడం మొదలుపెడితే? అతనితో వున్న మిత్రులంతా చెట్టు మీద దయ్యం వుందని నమ్మడం మొదలుపెడితే? అప్పుడేమౌతుంది? అదే నమ్మకాన్ని ఆ సమాజం మొత్తం అంగీకరించి, అదే వాస్తవం అని ప్రకటించుకుంటే? అప్పుడు అది ఆత్మాశ్రయ ఊహ కాదు. ఒక సమిష్టి ఊహ అవుతుంది. ఈ సమిష్టి ఊహే చరిత్రకి ప్రారంభం. అందరూ కలిసి ఊహించి, నిర్మించుకున్న కాల్పనిక విషయాలు కాల క్రమంలో అభిప్రాయాలుగా, నమ్మకాలుగా, ఏ మాత్రం కదల్చడానికి అవకాశం లేని శిలాశాసనాలుగా మిగిలిపోయాయి. వర్గం, సమాజం, దేశం, తెగ, స్వాతంత్ర్యం, సమానత్వం, ఆత్మలు, దేవుడు, దయ్యాలు, రాజు, రాజ్యం — ఇవన్నీ సమిష్టి ఊహలే. ఇలాంటి ఊహని కల్పించుకోగలిగిన ఆదిమానవుడు తన తెగలోని మనుషులను సమిష్టిపరచగలిగాడు. అందరినీ ఒక తాటి మీదకు తీసుకురాగలిగాడు. "మనం అంతా ఒకే తెగ వాళ్ళం", "లేదా మనం అందరం ఒకే దైవాన్ని కొలిచేవాళ్ళం" — "మనం అందరం కలిసి ఇతర జాతులని నిర్మూలిద్దాం" అని సహచరుల్ని కలుపుకోగలిగాడు. ఒక సమిష్టి నమ్మకం వాళ్ళలో ఐకమత్యాన్ని పెంచింది. అదే వాళ్ళ బలంగా మారింది. మిగిలిన జాతులను అంతమొందించేదాకా వెళ్ళింది" అంటూ ఆపాడు ఆచార్య వేదాంతం. అందరూ నిశబ్దంగా వింటున్నారు.

"చరిత్రకి మొదలు సంఘటన హింస కాదు, జ్ఞానం అయితే మనుషుల్లో ఒక జాతి మిగిలిన జాతులకన్నా గొప్పదన్న నమ్మకం ఆ రోజే కాదు, ఆ తరువాత చరిత్రలోఎన్నో సార్లు మళ్ళీ మళ్ళీ జరిగింది. ఇప్పటికీ జరుగుతూనే వుంది. అదే బాధాకరం." అంటూ విషాదంగా నవ్వాడాయన. ఆ రోజు పాఠం ముగిసినట్లు గంట మోగింది. ద్వీపకి ఆశ్చర్యంగా అనిపించింది. వేదాంతం ఏ పాఠం చెప్పినా ఆ

పాఠంలోని సారాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయం చేస్తాడు. ఈసారి స్పష్టంగా చెప్పలేదు. బహుశా విద్యార్థులే ఆ అన్వేషణ చెయ్యాలని ఆయన కోరుకున్నాడేమో.

ఆలోచిస్తూ ఆ తరగతి గదిలో నుంచి బయటకు వచ్చింది ద్వీప. అప్పటికే వేదాంతం అక్కడ నిలబడి వున్నాడు. ఎవరో వ్యక్తి అతనితో మాట్లాడుతున్నాడు.

"అవును ఆచార్యా... మరణదండన విధించేలా వుంది పరిస్థితి. అతను ఖచ్చితంగా పరదేశీ అనిపిస్తోంది." అంటూ ఆందోళనగా వివరిస్తున్నాడు.

★★★

బలంగా ఊపిరి పీల్చాడు బోసు. అదే తన ఆఖరి శ్వాస అని అతనికి అనిపించింది. కత్తి మెడను తాకగానే తల మొండెం వేరుపడిపోతాయి. ఆ తరువాత ఎంతోసేపు బాధ వుండకపోవచ్చు అనుకున్నాడు. సైనికుడు కత్తిని పైకి ఎత్తి బలంగా శ్వాస తీసుకున్నాడు. ఇక ఆ కత్తిని కిందకు దించేస్తాడు అనుకుంటున్న సమయంలో "ఆగండి!" అన్న అరుపు వినపడింది.

దళాధిపతి ఉగ్రుడైపోయాడు. ఆ అరుపు వచ్చిన వైపు చూశాడు. వచ్చినది వేదాంతం. అతనితో పాటు అతని శిష్యులు. ఆ శిష్యులలో కూడా ఆడపిల్లలు ఎక్కువమంది వుండటం దళాధిపతికి నచ్చలేదు. కానీ ఏమీ చెయ్యలేని పరిస్థితి. సాక్షాత్తు మహాధినేత కూడా వేదాంతం ముందు మోకరిల్లుతాడు. అయినా సరే గంభీరంగానే వున్నాడు. ఈ మరణదండన ఆపడం ఎవరివల్లా కాదని అతనికి తెలుసు. ఇంతటి తీవ్ర నేరానికి శిక్షే తప్ప వాదనలు, క్షమాపణలు వుండవు.

"వేదాంతంగారూ, నేరం ధర్మాతిక్రమణ. నలభై మూడు, ఇరవై ఒకటి ధర్మాల ఆధారంగా నేరం ఆరోపించబడి, నిరూపించబడింది. ఈ విషయంలో మీరు కలగజేసుకోకపోవడమే ఉత్తమమని నా సూచన" దళాధిపతి చెప్తున్నప్పుడు అతని ముఖంలో కర్కశంగానే వుంది.

"అతను పరదేశి అని నాకు సమాచారం అందింది"

"పరదేశి అయితే? అతను ఏ దేశం వాడు అన్నది అప్రస్తుతం. ఈ నేల మీద ఈ రాజ్యపు చట్టమే అమలులో వుంటుంది. కొత్తగా వచ్చినవాడు తెలుసుకోవాలి. నడుచుకోవాలి." వారిద్దరి మధ్య వాదన మొదలైందని అందరికీ అర్థం అయ్యింది.

"అతనికి ఇక్కడి చట్టాలు తెలియకపోవచ్చు."

"చట్టం తెలియకపోవటం ధర్మాతిక్రమణకు కారణం కాజాలదని ధర్మగ్రంథం మొదటి అధ్యాయంలోనే వుంది. మర్చిపోయారా?"

"నిజమే కానీ, నేరం చేసినవాడికి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం అమానుషం." వేదాంతం తన వాదనతో ఎలాగైనా ఒప్పించాలని ప్రయత్నం చేస్తున్నాడు.

బోసుకి ఇదంతా విచిత్రంగా వుంది. జరుగుతున్న సంఘటనలని ఆశ్చర్యంతో చూస్తున్నాడు. ఈ వాదన తనని చావు నుంచి తప్పిస్తుందా లేక కేవలం చావుని మరికొంత ఆలస్యం చెయ్యడానికి మాత్రమే పనికొస్తుందా అని అనుమానం వచ్చింది.

దళాధిపతి సమాధానం చెప్పసాగాడు.

"మాట్లాడనిస్తే ప్రతి నేరస్థుడి దగ్గరా నేరం చెయ్యడానికి ఒక కారణం వుంటుంది. అవన్నీ విని జాలిపడితే ధర్మపరిరక్షణ అసాధ్యం. అయినా మీకు తెలియనిది ఏముంది? శిక్ష ఒక త్యాగం లాంటిది. శిక్షపడినవాడు మిగిలిన ప్రజలకు చట్టం, ధర్మం యొక్క ప్రాముఖ్యతని నిరూపించినవాడు అవుతాడు. ఒక నియమం కోసం ఒక ప్రాణం పోతే ఆ నియమం బలం పెరుగుతుంది. ఆ నియమాతిక్రమణ

తగ్గుతుంది. శిక్ష కేవలం వాడు చేసిన తప్పుకే కాదు, అలాంటి తప్పు మళ్ళీ జరగకూడదని సమాజానికి గుర్తు చేయడం కోసం. ఇప్పుడు ఈ శిక్ష విధించకపోతే మన ధర్మ గ్రంథం విలువవేముంటుంది.” అన్నాడు.

ఈ విషయాన్ని పలు సభల్లో వేదాంతమే స్వయంగా చెప్పాడు. ఇప్పుడు అదే వాదనను తనకు అనుకూలంగా మలుచుకున్నాడు దళాధినేత. వాదన ఇక్కడికే వస్తుందని వేదాంతానికి కూడా తెలుసు. అయినా ఒక అమాయకుడికి శిక్షపడుతోందేమో అన్న ఆందోళన వల్లే ఆయన అలా చేశాడు.ఇప్పుడు ఆ అవకాశం కూడా పోయిందని అర్థం అయిపోయింది. మాటలు ఆగిపోయాయి. తల తిప్పి నేరం ఆరోపించబడిన బోసు వైపు చూశాడు. బోసు కూడా అతని వైపు చూశాడు కానీ ఆయన ముఖంలో అసహాయత అతనిలో కూడా నిరాశని నింపేసింది.

దళాధిపతి కనీసం బోసు వైపు చూడాను కూడా చూడలేదు. గట్టిగా నవ్వి “ఊ” అంటూ గట్టిగా హూంకరించాడు. బోసు పక్కన నిలబడ్డ వ్యక్తి మళ్ళీ కత్తి పైకెత్తాడు. “ఆగు” అని అరుపు వినిపించి అటు వైపు చూశాడు. వేదాంతాన్ని దాటుకోని ముందుకు వచ్చింది ద్వీప. ఆమె వెనుక మరో తొమ్మిది మంది ఆడవాళ్ళు వున్నారు. దళాధిపతికి విషయం అర్థం అయ్యింది.

“వాణ్ణి వదిలేయండి” అన్నాడు. ఒక్క క్షణం శరీరంలో విద్యుత్తు ప్రవహించినట్లు అనిపించింది బోసుకి. కత్తి ఎత్తినవాడు దాన్ని దించి పక్కన పడేశాడు. ఎవరో బోసు వెనక్కి వెళ్ళి అతని కట్లు, నోటికి వున్న గుడ్డ విప్పారు. మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడతను. దళాధిపతి దగ్గరగా వచ్చి, బోసు ముందు కూర్చోని ముఖంలో ముఖం పేట్టి మాట్లాడాడు.

“తప్పించుకున్నానని సంబరపడకు. ఈ సారి నువ్వు నేరం చేసినట్లు తెలిసిందా మరుక్షణం నీ రక్తంతో ఈ భూమికి అభిషేకం చేస్తాను. ఇక్కడ వుండాలంటే ఇక్కడి చట్టాన్ని తెలుసుకో... లేకపోతే బతకవు” కఠినత్వం అతని ముఖంలోనే కాకుండా గొంతులో కూడా వుండటం గమనించాడు బోసు. అతనికి మాట్లాడేందుకు ఓపిక లేదు. క్రమంగా స్పృహ తప్పుతున్నట్లు అనిపించింది.

ద్వీప, మరో అమ్మాయి బోసు దగ్గరకు వెళ్ళారు. వాళ్ళతో పాటు మరో చిన్నపిల్లాడు దగ్గరకు రావటం గమనించి వాడి వైపు చూశాడు. నందు!! తల ఎత్తి చూస్తే అప్పటిదాకా వాదన చేసిన వేదాంతం కన్పించాడు. అతని పక్కనే నిలబడిన వ్యక్తి వేదాంతానికి ఏదో వివరిస్తున్నాడు. మాటలను బట్టి అతనే వేదాంతాన్ని అక్కడకు తీసుకువచ్చాడని అర్థమయ్యింది. అతన్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది. ఎక్కడ? గుర్తుకొచ్చింది... నందు తండ్రి!

తనని ఇంట్లో మంచినీళ్ళ కూడా తాగనివ్వకుండా వెళ్ళగొట్టిన వ్యక్తి! అదే వ్యక్తి తనకు సహాయం చేశాడు. ఇప్పుడు ప్రాణాలతో మిగిలి వున్నాడంటే దానికి కారణం అతనే. అతన్ని పిలవాలని ప్రయత్నం చేశాడు కానీ గొంతు పెగల్లేదు.

“ఆచార్యా, మీతో ఏదో చెప్పాలంటున్నాడు” అరిచింది ద్వీప. ఆచార్య వేదాంతం, అతనితోపాటు నందు తండ్రి బోసు ముందుకు వచ్చి నిలబడ్డారు. బోసు కూర్చోనే చేతులు రెండు జోడించాడు. అతన్ని వారించే ప్రయత్నం చెయ్యబోయాడు నందు తండ్రి. కానీ అప్పటికే బోసు స్పృహ తప్పి పక్కకు వాలిపోయాడు. ద్వీప సమయానికి అతన్ని పట్టుకోని తన ఒళ్ళో పడుకోబెట్టుకుంది. బోసుకు మగత కమ్మేసింది.

అప్పటిదాకా దూరంగా మర్రి చెట్టుపైన బాణం ఎక్కుపెట్టి సిద్ధంగా వున్న వ్యక్తి బాణం వదలాల్సిన అవసరం రానందుకు సంతోషించి, చెట్టు దిగి కారడవి వైపు సాగిపోయాడు.

★★★

**(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)**

COMMENTS